క్లుప్తంగా

ఐటీఐ అడ్మిషన్లకు దరఖాస్తు చేసుకోండి

అనుమసముద్రంపేట: మండలంలోని హసనాపురంలో ఉన్న ప్రభుత్వ పారిశ్రామిక శిక్షణా సంస్థ (ఐటీఐ)లో అడ్మిషన్లకు అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపల్ గౌస్‌బాషా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఫిట్టర్, ఎలక్ట్రిషియన్ ట్రేడ్‌ల్లో ఖాళీలు ఉన్నాయని, 10వ తరగతి పాసైన విద్యార్థులు ఈ నెల 27వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. 28వ తేదీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఉంటుందని, 30వ తేదీ తమ ఒరిజినల్ సర్టిఫికెట్లతో కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు.

వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జిగా 'చిమ్మిలి'


చిమ్మిలి రవీంద్ర

కొండాపురం: మండల వైఎస్సార్‌సీపీ ఇన్‌చార్జిగా చిమ్మిలి రవీంద్రను నియమించినట్లు ఉదయగిరి నియోజకవర్గ సమన్వయకర్త మేకపాటి రాజారెడ్డి వ్యక్తిగత కార్యదర్శి శ్రీనాథ్ మంగళవారం తెలిపారు. చిమ్మిలి రవీంద్ర మాట్లాడుతూ తనపై నమ్మకం ఉంచి పార్టీ బాధ్యతలు అప్పగించిన మేకపాటి రాజారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. మండలంలో పార్టీ నాయకులు, కార్యకర్తలకు అందుబాటులో వారితో కలిసి సమన్వయంతో పార్టీ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. కొండాపురం జేసీఎస్ కన్వీనర్‌గా మాజీ కన్వీనర్ యారం నరసింహారావుకు అప్పగించారు.

నేడు డయల్ యువర్ డీఎం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు ఆర్టీసీ డిపోలో బుధవారం డయల్ యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజరు కరీమున్నీసా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు ఆర్టీసీ అధికారుల బృందం ఈ కార్యక్రమంలో పాల్గొంటామన్నారు. ఆత్మకూరు ప్రాంత ప్రయాణికులు, ప్రజలు తమ విలువైన సూచనలు, సలహాలు, ఫిర్యాదులను సెల్ నంబరు 99592 25645లో సంప్రదించి తెలియజేయాలని కోరారు.

'ఆడుదాం ఆంధ్రా'కు నమోదు చేసుకోండి

చేజర్ల(సోమశిల): 'ఆడుదాం ఆంధ్రా'కు 17 ఏళ్లు నిండిన యువకులు గ్రామ సచివాలయాల్లో పేర్లు నమోదు చేసుకోవాలని అనంతసాగరం ఎంపీడీఓ మదుసూదన్‌రావు తెలిపారు. మంగళవారం తన చాంబర్‌లో 'ఆడుదాం ఆంధ్రా'పై మండల విద్యాశాఖాధికారులు, వ్యాయామ ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. ఎంపీడీఓ మాట్లాడుతూ అక్టోబర్ 2వ తేదీ నుంచి క్రికెట్, వాలీబాల్, ఖోఖో, కబడ్డీ, బ్యాడ్మింటన్‌కు మండల స్థాయిలో పోటీలు జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు ఎం బాలకృష్ణారెడ్డి, కే ప్రభాకర్‌రెడ్డి, ఫిజికల్ డైరెక్టర్ కే గౌరీరెడ్డి, వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉపాధి పనులపై సామాజిక తనిఖీ

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండల పరిషత్ కార్యాలయంలో సామాజిక తనిఖీ బృందం మంగళవారం ఉపాధి హామీ పథకం 15వ విడత సామాజిక తనిఖీ చేపట్టారు. ఆత్మకూరు క్లస్టర్ ఏపీడీ శంకర్ నారాయణ, సామాజిక తనిఖీ ఎస్‌ఆర్‌పీ గోవర్ధన్ మాట్లాడుతూ ప్రతి గ్రామ పంచాయతీలో మూడు రోజుల పాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. పంచాయతీరాజ్, ఇరిగేషన్, విద్యాశాఖ ఉపాధి హామీ పథకాల్లో చేపట్టిన పనుల విషయమై జమా ఖర్చులను పారదర్శకంగా లెక్కలు చూస్తామన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఎంపీడీఓ మస్తాన్‌ఖాన్, ఏపీఓ సునీల్, పీఏ రవీంద్ర, ఫీల్డ్ అసిస్టెంట్‌లు, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు పాల్గొన్నారు.

హాస్టళ్లలో ఆకస్మిక తనిఖీ

ఆత్మకూరు: పట్టణంలోని బాలుర, బాలికల సంక్షేమ హాస్టళ్లను జిల్లా బీసీ సంక్షేమాధికారి వై వెంకటయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఏబీసీడబ్ల్యూఓ చల్లా శ్రీదేవితో కలిసి తొలుత జీఆర్‌పేటలోని కళాశాల బాలుర హాస్టల్‌ను పరిశీలించారు. అక్కడ వసతులు సరిగా లేకపోవడంతో ఆ హాస్టల్‌ను సోమశిల రోడ్డులోని చెరువు సమీపంలో ఉన్న ఎస్సీ బాలుర హాస్టల్ మేడపైకి మార్పు చేసే విషయంపై శ్రీదేవితో చర్చించారు. జిల్లా కలెక్టర్ దృష్టికి సైతం తీసుకెళ్లినట్లు, అనుమతులు రాగానే హాస్టల్‌ను బదిలీ చేస్తామన్నారు. బాలికల సంక్షేమ హాస్టల్ పరిశీలించారు. ఆహార పదార్థాలు రుచి చూశారు. హాస్టల్ విద్యార్థినులతో ఏవైనా సమస్యలు ఉన్నాయా అని అడిగి తెలుసుకున్నారు. హాస్టల్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాల్సిన బాధ్యత సిబ్బందిదేనన్నారు.

పనికి రాలేదని అడిగితే దాడి

ఆత్మకూరు: ముందుగా డబ్బులు తీసుకుని పనికి ఎందుకు రాలేదని అడిగినందుకు ఓ వ్యక్తిపై దాడి చేసిన ఘటన మంగళవారం జరిగింది. ఎస్సై ముత్యాలరావు సమాచారం మేరకు.. ఆత్మకూరుకు చెందిన ఖాజారసూల్ ఇంటి నిర్మాణ పని చేయిస్తున్నాడు. బేల్దారి హసన్‌కు ముందుగా కూలి డబ్బులిచ్చాడు. అయితే ఎన్ని రోజులైనా పనికి రాకపోవడంతో మంగళవారం ఉదయం సోమశిల రోడ్ సెంటర్‌లో ఉన్న హసన్‌ను ఖాజారసూల్ ప్రశ్నించాడు. దీంతో హసన్, మరో వ్యక్తి మహబూబ్‌బాషా కలిసి కర్రతో ఖాజారసూల్‌పై దాడికి పాల్పడ్డాడు. దీంతో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. బాధితుడి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. దాడికి పాల్పడిన వారిని అదుపులోకి తీసుకున్నట్లు ఎస్సై తెలిపారు.

టీడీపీలో నేతల కలవరం

కావలి టీడీపీలో అస్తిత్వం నెలకొంది. రాజకీయంగా సంక్లిష్ట పరిస్థితులను ఎదుర్కొంటున్న టీడీపీ కావలి నుంచి ఎవరిని బరిలోకి దింపాలో అర్థం కాని అయోమయంలో ఉంది. కావలి నియోజకవర్గంలో అధికార వైఎస్సార్‌సీపీ క్షేత్రస్థాయిలో వేళ్లూనుకుని పోయింది. అధికార పార్టీ ఎమ్మెల్యే సమర్థతకు తోడు.. పార్టీ కూడా బలంగా ఉండడంతో దీటుగా ఎదుర్కొనే పరిస్థితి టీడీపీలో స్థానికుల్లో ఎవరికి లేదు. బయట నుంచి రూ.కోట్లు కుమ్మరించే కొత్త ముఖాన్ని బరిలోకి దింపాలనే ఆలోచనలో పార్టీ అధిష్టానం ఉన్నట్లు సమాచారం. ఆ నేపథ్యంలోనే ఆశావహులను ఊరిస్తూ ఊడిగం చేయించుకుంటోంది.

- నేనే లీడర్‌నంటూ రోజుకొక కొత్త నేత హడావుడి
- తమ్ముళ్లది తలోదారి
- ఎవరికి జైకొట్టాలో తెలియని అయోమయం
- ఎన్నికల దాక ఏటీఎంగా మాలేపాటి!
- కావ్య సైడ్ ట్రాక్‌లోకేనా?
- పసుపులేటి ధీమా వెనుక ధైర్యం ఏమిటి

కావలి: సార్వత్రిక సమరానికి ఆర్నెల్లు కూడా సమయం లేదు. కావలి టీడీపీ రథ సారథి ఎవరో ఇప్పటికీ తేల్చలేని అనిశ్చిత పరిస్థితి నెలకొంది. 2019 ఎన్నికల తర్వాత నుంచి ఆ పార్టీ పూర్తిగా కనుమరుగైపోయింది. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో రోజుకొక లీడర్ ధనబలంతో నేనే బరిలో ఉంటానంటూ హడావుడి చేస్తున్నారు. ఏడాదిన్నర క్రితం పార్టీని బతికించుకునేందుకు విలేజ్ స్థాయి లీడర్ మాలేపాటి సుబ్బానాయుడుకి నియోజకవర్గ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించింది. ఇప్పటికే రూ.కోట్లు ఖర్చు పెట్టినా.. సీటు గ్యారెంటీ లేని త్రిశంకు స్వర్గంలో మాలేపాటి ఊగిసలాడుతున్నాడు. కొద్ది నెలల క్రితమే పక్కా వ్యాపారవేత్త అయిన కావ్య కృష్ణారెడ్డి టీడీపీ మహానాడుకు, లోకేశ్ పాదయాత్రకు భారీగా విరాళం అందజేసి.. తానే ఎమ్మెల్యే అభ్యర్థిగా ఆర్భాటం చేశాడు. తీరా లోకేశ్ యాత్ర కావలికి చేరుకునేటప్పటికే సైలెంట్‌గా సైడ్ ట్రాక్‌లోకి నెట్టేశారు. తాజాగా నాలుగేళ్లలో రెండు పార్టీలు మారుతూ వచ్చిన ఓ రియల్ ఎస్టేట్ వ్యాపారి పసుపులేటి సుధాకర్ టీడీపీలో చేరకపోయినప్పటికీ తానే ఎన్నికల బరిలోకి ఉంటానంటూ హడావుడి చేస్తున్నాడు. ఇప్పటికే చంద్రబాబును కలిసిన పసుపులేటి.. లోకేశ్‌ను సైతం కలిసి ప్రజాక్షేత్రంలో ప్రచారం మొదలు పెట్టాడు. పల్లెల్లో పట్టుమని పది మంది కూడా వెంట లేకపోయినప్పటికీ పసుపులేటి మంగళవారం విలేకరుల సమావేశం పెట్టి 2024 ఎన్నికల్లో తానే ఎమ్మెల్యేనంటూ రాసి పెట్టుకోవాలంటూ, కావలిని కనకపట్నం చేస్తా.. సింగపూర్ చేస్తానంటూ ఊదరగొట్టాడు. టీడీపీ పెద్దల భరోసాతోనే పసుపులేటి ధీమాతో మాట్లాడినట్లు ప్రచారం జరుగుతోంది.

నిర్వేదంలో తమ్ముళ్లు

సంక్లిష్టంగా ఉండే కావలి రాజకీయాల్లో టీడీపీది విచిత్రమైన పరిస్థితి. అసలు ఆ పార్టీలో నాయకుడు ఎవరో, ఎంత కాలం ఎవరి నాయకత్వంలో పని చేయాలో పార్టీ శ్రేణులు ఎన్ని రకాల రాజకీయ పరిశోధలు చేసినా అంతుపట్టని 'అంతరంగాలు'గా మిగిలిపోయింది. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పార్టీలకు అతీతంగా సంక్షేమ ఫలాలు అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి అందుతున్న నేపథ్యంలో క్షేత్రస్థాయిలో కీలకంగా ఉండే పార్టీ శ్రేణులు ఇప్పటికే టీడీపీకి ముఖం చాటేస్తున్నారు. మళ్లీ టీడీపీ అధికారంలోకి వస్తే ఈ పాటి పథకాలు ఏవీ దక్కే అవకాశం లేదనే ఆలోచనతో పార్టీ కార్యక్రమాలకు సైతం దూరదూరంగా ఉండిపోతున్నారు. ద్వితీయ శ్రేణి తమ్ముళ్లు దిక్కుతోచక నిర్వేదంలో మునిగిపోయారు.

ధనబలం తప్ప.. జనబలం లేని నేతలు

కావలి టీడీపీ నుంచి పోటీ చేయాలని తహతహలాడుతున్న నేతలకు ధన బలం తప్ప.. జన బలం లేదు. పైగా పార్టీ బలం కూడా అంతకన్నా.. లేదు. అయితే ఎమ్మెల్యే స్థాయి అభ్యర్థులుగా బరిలో నిలిస్తే.. ఓడినా గెలిచే పార్టీకి జైకొట్టి ఎమ్మెల్సీ పదవి కొట్టేయొచ్చనే ఆలోచనగా కనిపిస్తోంది. మాలేపాటి స్థాయి ఏమిటంటే.. ఆయన సొంత ఊరు దగదర్తిలో తన నివాసం ఉండే పంచాయతీలో సర్పంచ్‌ను కానీ, ఎంపీటీసీని గెలిపించుకోలేకపోయిన లీడర్. ఎన్నికల దాక మాలేపాటిని ఏటీఎంగా వాడుకునేందుకే ఆయన్ను నియోజకవర్గ స్థాయి లీడర్‌గా పెట్టినట్లు ఆ పార్టీ వర్గాలు చెబుతున్నాయి. ఇకపోతే దగుమాటి కృష్ణారెడ్డి అలియాస్ కావ్య కృష్ణారెడ్డి పక్కా కమర్షియల్. అడ్డదారుల్లో రూ.కోట్లు కొల్లగొట్టి ధనబలంతో పైరవీలు చేసైనా రాజకీయంగా ఒక మెట్టు ఎదగాలనే దుగ్ధ ఉన్న నేత. ఎన్నికల ముందు తప్ప.. ఆ తర్వాత రోజుల్లో జనానికి కనిపించని లీడర్. ట్రస్ట్ పేరుతో రాజకీయం చేస్తూ ఎన్నిల తర్వాత ముఖం చాటే నైజం నేత. లోకేశ్ పాదయాత్రలో కావ్య తరఫున కనీసం ఫ్లెక్సీలు కూడా కట్టనీయకుండా చేయడంతో ఆయన్ను సైలెంట్‌గా సైడ్ ట్రాక్ చేసినట్లు అర్థమవుతోంది. మరో నేత పసుపులేటి సుధాకర్. బోగోలు మండలానికి చెందిన పసుపులేటి రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తూ హైదరాబాద్‌లో స్థిరపడ్డాడు. బాగా సంపాదించిన పసుపులేటి రూ.కోట్లు కుమ్మరించి జనసేనతో రాజకీయ ఆరంగ్రేటం చేశాడు. 2019లో జనసేనలో చేరి కావలి నుంచి పోటీ చేసి బొక్కా బోర్లాపడ్డాడు. ఎన్నికలు ముగిసిన కొద్ది రోజులకే బీజేపీలో చేరారు. తాజాగా ఎన్నికలు సమీపిస్తున్న వేళ చంద్రబాబును కలిశారు. ఆ తర్వాత పాదయాత్రలో లోకేశ్‌ను కలిశారు. కావలి నియోజకవర్గంలో జరిగిన లోకేశ్ పాదయాత్రలో పసుపులేటి నడవలేదు కానీ ఇటీవల నెల్లూరుకు వచ్చిన చంద్రబాబుకు స్వాగతం చెబుతూ భారీగానే ఖర్చు చేశాడు. రాబోయే ఎన్నికల్లో పసుపులేటి టీడీపీ నుంచి బరిలో ఉంటాడనే ప్రచారం ఊపందుకుంది. తాజాగా సుధాకర్ అనేక పేర్లతో పల్లెపల్లెకు ప్రచారానికి వెళ్తున్నాడు. చుట్టూ పట్టుమని పది మంది కూడా రాకపోవడంతో మంగళవారం పసుపులేటి ఊహల్లో తేలియాడిపోతూ.. తానే ఎమ్మెల్యేనంటూ ఏ పార్టీ నుంచి పోటీ చేస్తానో తర్వాత చెబుతానంటూ, చంద్రబాబును కలిశానంటూ చెప్పుకొచ్చాడు. ఈ పరిణామాలు కావలి టీడీపీలో ప్రకంపనలు సృష్టిస్తోంది. ఇవన్నీ గమనిస్తున్న కావలి టీడీపీ శ్రేణులు ఎవరి ప్రోత్సాహం, ప్రోద్బలంతో పసుపులేటి పార్టీ అగ్రనాయకులను నేరుగా కలుసుకోగలుగుతున్నాడని చెవులు కొరుక్కుంటున్నారు. పసుపులేటి ధీమా చూస్తేంటే.. పార్టీ పెద్దలే మాలేపాటిని, కావ్యను సైడ్ చేసి, పసుపులేటికి అభయమిచ్చినట్లు తెలుస్తోంది. ఎన్నికల నాటికి మరో కొత్త నేతను పరిచయం చేస్తారనే ప్రచారం కూడా టీడీపీ శ్రేణుల నుంచి వినిపిస్తోంది. మొత్తం మీద టీడీపీలో రాజకీయ అనిశ్చితికి తెరపడే అవకాశం లేదనిపిస్తోంది.



రేపటి నుంచి ఇంద్రాక్షి తిరునాళ్ల

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): మర్రిపాడు మండలం చుంచులూరులో కొలువై ఉన్న ఇంద్రాక్షి అమ్మవారి వార్షిక తిరునాళ్ల గురువారం నుంచి నిర్వహిస్తున్నామని దేవస్థానం కమిటీ మంగళవారం తెలిపింది. స్వర్ణ కంకణ పురస్కార గ్రహీత, సామవేద శిరోమణి బిరుదాంకితుడు పలుకూరి మురళీ కృష్ణామాచార్యులు ఆధ్వర్యంలో ప్రతి రోజు విశేష అర్చనలు, పూజలు, అన్నదానాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. 24న వేమన చెంచు రత్నం కుమారులు ఉభయకర్తలుగా చెండీ హోమం, అన్న ప్రసాద వినియోగం జరుగుతుందన్నారు. 25న దువ్వూరు, కలిశెట్టి బ్రదర్స్, వేమన చెంచు సుబ్బయ్య, వేమన సింగయ్యశెట్టి కుటుంబ సభ్యుల ఆధ్వర్యంలో అభిషేకాలు, సామూహిక వరలక్ష్మీ వ్రతం, అమ్మవారికి పొంగళ్లు నిర్వహిస్తున్నామన్నారు. ఈ సందర్భంగా నటరాజ నిలయ చలనచిత్ర కళాప్రదర్శన సుందరాకాండ తోలుబొమ్మలాట, వివిధ కార్యక్రమాల సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేశామని భక్తులు అధిక సంఖ్యలో హాజరు కావాలని కోరారు.

నేడు కొత్త పింఛన్ దరఖాస్తుల పరిశీలన

ఉదయగిరి: మండలంలో కొత్తగా సామాజిక, వికలాంగ పింఛన్ల దరఖాస్తుల పరిశీలన ప్రక్రియ బుధవారం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ మల్లికార్జునరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని 12 సచివాలయాల పరిధిలో 127 మంది పింఛను కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు.

రెవెన్యూ సమస్యల పరిష్కారానికి సమన్వయ కమిటీ

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరురూరల్ (మర్రిపాడు): ఆత్మకూరు నియోజకవర్గంలో రెవెన్యూ సమస్యలను సత్వరం పరిష్కరించేందుకు ప్రత్యేక దృష్టితో పని చేస్తున్నామని ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తెలిపారు. మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని తన నివాసంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ రెవెన్యూ సమస్యలను తన దృష్టికి తీసుకు వచ్చేందుకు మండలాల వారీగా సమన్వయ కమిటీ సభ్యులను నియమించామని తెలిపారు. రైతులు, భూ యజమానులు వ్యయ ప్రయాసలకు గురి కాకుండా వారికి సౌలభ్యంగా ఉండేందుకు ఈ ఏర్పాటు చేశామన్నారు. ఆత్మకూరు టౌన్‌కు సంబంధించి నాగులపాటి ప్రతాప్‌రెడ్డి, ఆత్మకూరు రూరల్ గడ్డం శ్రీనివాసులురెడ్డి, మర్రిపాడు గంగవరపు శ్రీనివాసులునాయుడు, అనంతసాగరం రాపూరు వెంకటసుబ్బారెడ్డి, చేజర్ల గాలిపాళెం చంద్రశేఖర్‌రెడ్డి, అనుమసముద్రంపేట అంబవరపు కోటిరెడ్డి, సంగం గుండాల బాలచంద్రారెడ్డి సమన్వయ కమిటీ సభ్యులుగా నియమించామన్నారు. తమ సమస్యలను సమన్వయ కమిటీ దృష్టికి లేదా నెల్లూరులోని తన కార్యాలయంలో ఉన్న విశ్రాంత తహసీల్దారు రామలింగేశ్వరరావును కానీ సంప్రదించి రెవెన్యూ సమస్యలపై త్వరితగతిన పరిష్కారం పొందవచ్చన్నారు. ప్రతి నెలలో రెండు సార్లు కలెక్టర్‌తో నియోజకవర్గంలోని అన్ని మండలాల తహసీల్దార్లు, ఆర్డీఓ సంయుక్తంగా సమీక్ష సమావేశం నిర్వహించి ఎప్పటికప్పుడు ఆయా సమస్యలు పరిష్కరించేందుకు కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు.

మహిళలకు ఆర్థిక చేయూత దక్కింది

- ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి

ఆత్మకూరు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పలు సంక్షేమ పథకాల ద్వారా మహిళలకు అందించడంతో వారికి ఆర్థిక చేయూత దక్కిందని ఆత్మకూరు ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని వెలుగు కార్యాలయంలో మంగళవారం మెప్మా, వైఎస్సార్ క్రాంతి పథం, పొదుపు మహిళా గ్రూపులతో సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి మాట్లాడుతూ జగనన్న చేయూత, ఆసరా, పొదుపు రుణమాఫీ, వడ్డీలేని రుణాలు తదితర పథకాల ద్వారా ఆర్థిక సాయం చేకూరడంతో సమాజంలో మహిళల గౌరవం పెరిగిందన్నారు. ఇళ్లు లేని మహిళలకు టిడ్కో ఇళ్లలో అవకాశం రావడం, కోరుకున్న వారికి అర్హతే ప్రమాణికంగా వైఎస్సార్ జగనన్న లేఅవుట్లలో ఇళ్ల స్థలాలు ఇచ్చి ఇళ్ల నిర్మాణం కోసం ఆర్థిక సాయం అందించడంతో వారికి మంచి భరోసా ఏర్పడిందన్నారు. మున్సిపల్ పరిధిలో 384 మంది పొదుపు మహిళలకు రూ.35 వేలు వంతున ఇళ్ల నిర్మాణానికి రుణ సాయం అందించినట్లు ఆయన తెలిపారు. మెప్మా, క్రాంతి పథం అధికారులు వెంకయ్య, వెంకటేశ్వర్లు మాట్లాడుతూ త్వరలో టీఎల్‌ఎఫ్ ఆధ్వర్యంలో పొదుపు మహిళలతో మెగా మహిళా మార్ట్, 'ఆహా' క్యాంటీన్ ఏర్పాటు చేయనున్నట్లు వివరించారు. పొదుపు మహిళలు తయారు చేసే వస్తువుల ఉత్పత్తులను ఫ్లిప్‌కార్ట్, అమెజాన్ సంస్థలతో అమ్మకాలకు సంప్రదిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైఎస్సార్ ఐకేపీ సిబ్బందికి 23 శాతం జీతం పెంచడంతో ఎమ్మెల్యే కేక్ కట్ చేయించి సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేయించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ బి నాగేశ్వరరావు, ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, చైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, వైస్ చైర్మన్ సర్దార్, వివిధ మండలాల ఏపీఎంలు బి వెంకమ్మ, సుజన, బుజ్జమ్మ, శేషమ్మ, భాస్కర్, లత, మెప్మా ఆర్పీలు, సీసీలు, పట్టణ పార్టీ అధ్యక్షుడు అల్లారెడ్డి ఆనంద్ రెడ్డి, జేసీఎస్ కన్వీనర్ డాక్టర్ సీహెచ్ ఆదిశేషయ్య, కౌన్సిలర్లు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు దేశానికే ఆదర్శం

- వైఎస్సార్‌సీపీ నాయకులు


విలేకరులతో మాట్లాడుతున్న ఎంపీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులు

ఆత్మకూరు: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అర్హత ఉన్న ప్రతి కుటుంబానికి పలు సంక్షేమ పథకాలు పారదర్శకంగా అందిస్తున్నారని, ఈ పథకాలు దేశంలోని పలు రాష్ట్రాలకు ఆదర్శంగా ఉన్నాయని ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డితో పాటు పలువురు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. పట్టణంలోని ఎమ్మెల్యే కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. గత నాలుగేళ్లలో మండలంలోని పలు గ్రామాలకు రూ.105 కోట్ల అభివృద్ధి, సంక్షేమ పథకాల ద్వారా ప్రజలకు చేరాయన్నారు. విద్యాభివృద్ధికి పెద్దపీట వేస్తూ నాడు-నేడు పథకంతో మారుమూల గ్రామాల్లో సైతం ప్రభుత్వ పాఠశాలలను ఆధునికీకరించారని, అమ్మఒడితో పేద కుటుంబాలను ఆదుకుంటూ వారి పిల్లలకు ఉచితంగా విద్య అందిస్తున్నారన్నారు. నేడు ముఖ్యమంత్రి ఆలోచనల మేరకు అమలు చేస్తున్న అమ్మఒడి, విద్యాదీవెన, వసతి దీవెన పథకాల ప్రయోజనం భవిష్యత్‌లో ఫలితాలు కనిపిస్తాయన్నారు. ఉద్యోగుల కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి తీసుకువస్తున్న జీపీఎస్ పథకాన్ని దేశంలోని ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నాయన్నారు. సచివాలయం, వలంటీర్ వ్యవస్థలను ఇతర రాష్ట్రాలు అమలు చేసేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఎమ్మెల్యే విక్రమ్‌రెడ్డి రికార్డ్ స్థాయిలో నియోజకవర్గంలోని 73 సచివాలయాల పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం నిర్వహించారని మరో 20 సచివాలయాల పరిధిలో నిర్వహించాల్సి ఉందన్నారు. ఏడీఎఫ్ ద్వారా ఆత్మకూరు అభివృద్ధికి కృషి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ నేతలు గిరిధర్‌నాయుడు, సర్పంచ్ బొలిగర్ల వెంకటేశ్వర్లు, రఘురామిరెడ్డి పాల్గొన్నారు.

ఆక్రమణల తొలగింపులో ఉద్రిక్తత



అనుమసముద్రంపేట: ఏఎస్‌పేటలో దర్గా ప్రాంతంలో ఆక్రమణలను తొలగించే విషయంలో అధికారులు, వ్యాపారస్తుల మధ్య ఉద్రిక్తత చోటు చేసుకుంది. దర్గా ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలనే ఉద్దేశంతో దర్గా ప్రధాన రహదారి విస్తరణకు ఆక్రమణలను తొలగించేందుకు రెండు రోజుల నుంచి పంచాయతీ అధికారులు కసరత్తు ప్రారంభించారు. అయితే మొదటి రోజు సజావుగా ఆక్రమణల తొలగింపు సాగినప్పటికి మంగళవారం అడ్డుపడ్డారు. పంచాయతీ కార్యదర్శి తనకు నచ్చిన వాళ్ల రూముల వద్ద తగ్గించి మిగిలిన ప్రాంతాల్లో పరిమితికి మించి కొలతలు వేయించారని వ్యాపారస్తులు ఆరోపిస్తున్నారు. దీంతో సీఐ రవినాయక్, ఎస్సై నరేష్ తమ సిబ్బందితో ఘటన స్థలానికి చేరుకుని వ్యాపారస్తులను శాంతింప చేశారు.

సాగునీటి కోసం రైతుల ఆందోళన



సంగం: సంగం కావలి కాలువ వద్ద ఆయకట్టు రైతులు మంగళవారం ఆందోళన చేపట్టారు. తమకు రోజు మార్చి రోజు సాగునీరు నీరందించాలంటూ డిమాండ్ చేశారు. రైతులు మాట్లాడుతూ కావలి కాలువ అధికారులు తమ మోటార్ల లింకులు తొలగించి ఇబ్బందులు గురి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒప్పందం ప్రకారం సాగునీరు అందించాలని డిమాండ్ చేశారు. కావలి కాలువ పరిధిలో ఉన్న సంగం భూములను అధికారులు కావలి కాలువ ఆయకట్టులో అధికారికంగా చేర్చాలని కోరారు.

దొంగ ఎస్సీ సర్టిఫికెట్లు పొందిన వారిపై చర్యలు తీసుకోండి


వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందిస్తున్న యూనియన్ నాయకులు

అల్లూరు: దొంగ ఎస్సీ సర్టిఫికెట్లు పొంది తమకు అన్యాయం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ చంద్రశేఖర్‌కు మంగళవారం ఎస్సీ యూనియన్ నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ మండలంలో దాదాపు 50 మంది పైచిలుకు శంభుని కాపులు, శంభన్ రెడ్లు ఎస్సీ హిందు మాల అని దొంగ సర్టిఫికెట్లు పొంది వివిధ కళాశాలల్లో రిజర్వేషన్లను అనుభవిస్తూ రాజ్యాంగ పరంగా అసలైన ఎస్సీలకు రావాల్సిన హక్కులను హరిస్తున్నారని వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎల్లు సాల్మాన్‌రాజు, ఎ.రమణయ్య, పి శ్రీనివాసులు, ఎం నరేంద్ర, పి సుధాకర్, కె వెంకటేష్ పాల్గొన్నారు.

బీరంగుంట సచివాలయంలో ట్రైయినీ కలెక్టర్


రికార్డులు పరిశీలిస్తున్న ట్రైయినీ కలెక్టర్ వి సంజనసింహ

అల్లూరు: పంచాయతీ కార్యదర్శిగా వారం రోజుల పాటు ఆచరణాత్మక శిక్షణ ట్రైనీ కలెక్టర్ వి సంజనసింహ బీరంగుంట సచివాలయానికి మంగళవారం విచ్చేశారు. ఈ నెల 26వ తేదీ వరకు బీరంగుంట పంచాయతీలో పరిపాలనపై రోజు వారీగా శిక్షణ పొందనున్నారు. శిక్షణ పొందుటకు అన్నీ ఏర్పాట్లు చేసినట్లు ఎంపీడీఓ శ్రీదేవి తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి సుస్మితారెడ్డి స్థానిక స్వపరి పాలనలోని గ్రామ పంచాయతీ వ్యవస్థ తీరు తెన్నులు, నిధుల కేటాయింపు, గ్రామ పంచాయతీ కార్యదర్శి విధులు తదితర అంశాలను ట్రైనీ కలెక్టర్‌కు వివరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ చంద్రశేఖర్, ఈఓపీఆర్డీ కే పెంచల వీరేంద్ర, గ్రామ సర్పంచ్‌లు కవిత, కరిముల్లాషాఖాదర్, ఇన్‌చార్జి హౌసింగ్ ఏఈ కిరణ్, వైస్ ఎంపీపీ సురేంద్ర, నాయకులు గరిక నరసింహారావు, కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగనన్నది సువర్ణ పాలన


లబ్ధిదారులకు సంక్షేమ పథకాల బుక్‌లెట్ అందిస్తున్న ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

- ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి

కావలి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సువర్ణ పాలన సాగిస్తున్నారని కావలి ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి తెలిపారు. చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీలను, పథకాలను అమలు చేయకపోగా, అడిగిన వారిని దబాయింపులతో పాలన చేశారన్నారు. ఇదే జగన్‌మోహన్‌రెడ్డి, చంద్రబాబు పాలనకు తేడా అని చెప్పారు. మండలంలోని గౌరవరంలో మంగళవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే నిర్వహించారు. గ్రామంలో ప్రతి ఇంటిని సందర్శించి ఆయా కుటుంబ సభ్యులతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై మాట్లాడారు. ఆ కుటుంబాలకు ప్రభుత్వం అందజేసిన పథకాల వివరాలు పొందుపరిచిన బుక్‌లెట్లను ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ సీఎం జగనన్న సంక్షేమం, అభివృద్ధి మాటల్లో కాకుండా చేతల్లో చూపుతున్నారని చెప్పారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల హామీల్లో ఇచ్చిన నవరత్నాలతో పాటు చెప్పని పథకాలు, కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారని చెప్పారు. ప్రతి నిరుపేద కుటుంబానికి నవరత్నాల్లో భాగంగా ఆర్థిక చేయూత ఇస్తున్నారన్నారు. టీడీపీ పాలనలో జన్మభూమి కమిటీలను ఏర్పాటు చేసి ఆ పార్టీ కార్యకర్తలకు మాత్రమే సంక్షేమ పథకాలు అందించారని గుర్తు చేశారు. మన ప్రభుత్వంలో అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నారని వివరించారు. ప్రభుత్వం చేసే అభివృద్ధిపై ఓర్వలేక ప్రతిపక్షాల అసత్య ప్రచారాలు చేస్తున్నాయని దుయ్యబట్టారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం అభివృద్ధిని కాగితాలకే పరిమితం చేస్తూ ప్రజలను మోసం చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత ప్రభుత్వం అభివృద్ధిని కళ్లకు కట్టినట్లు ప్రత్యక్షంగా ప్రజలకే చూపుతోందని వివరించారు. చంద్రబాబు వికృత చేష్టలకు ఒడిగడుతూ ఎల్లో మీడియాతో దుష్ప్రచారం చేస్తూ సీఎం వైఎస్ జగన్ సంక్షేమ రథానికి అడుగడుగునా అడ్డు తగులుతున్న వైనాన్ని ప్రజలు గమనించాలని ఎమ్మెల్యే కోరారు. సర్పంచ్ దేవరపల్లి రాధిక, జెట్పీటీసీ జంపాని రాఘవులు, నాయకులు కున్నం వెంకట్రామిరెడ్డి, చింతం బాబుల్‌రెడ్డి, పలకా శ్రీధర్‌రెడ్డి, సురే శ్రీనివాసులురెడ్డి, సురే జయశ్రీ, దేవరపల్లి మహేంద్ర, నాగనగారి శ్రీనివాసులు, జిల్లా కో-ఆపరేటివ్ సెంట్రల్ బ్యాంక్ డైరెక్టర్ చింతం తిరుముల రాణి, ఎంపీటీసీ సభ్యురాలు చింతం రమణమ్మ, ఉప సర్పంచ్ సురే శ్రీలత, చెన్ను ప్రసాద్‌రెడ్డి, కావలి మున్సిపల్ మాజీ కౌన్సిలర్ పులి రజని, పులి చక్రపాణి పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాల పరిశీలన పక్కాగా ఉండాలి


అధికారులతో ఓటర్ల జాబితా పరిశీలనపై సమీక్షిస్తున్న ఆర్డీఓ కరుణకుమారి

- ఆర్డీఓ సాధు కరుణకుమారి

ఆత్మకూరు: ఓటర్ల జాబితాల పరిశీలన ప్రక్రియను పక్కాగా నిర్వహించాలని ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా పరిశీలన పూర్తి చేయాలని ఆత్మకూరు ఆర్డీఓ సాధు కరుణకుమారి సూచించారు. ఆర్డీఓ కార్యాలయంలో మంగళవారం డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, ఎంపీడీఓలు, సూపర్‌వైజర్లు, పలు రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. కొన్ని చోట్ల సూపర్‌వైజర్లు సహకరించడం లేదని తహసీల్దార్లు ఫిర్యాదు చేశారని, మరో సారి అలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. ఫారం 7ను నిశితంగా పరిశీలించి, సంబంధిత ఓటరు మృతి చెంది ఉంటే ధ్రువీకరణ కోసం వారి కుటుంబ సభ్యుల్లో ఒకరి దగ్గర సంతకం చేయించుకోవాలని సూచించారు. అనవసరంగా ఓట్లు తొలగించారనే ఫిర్యాదులను రాకుండా చూసుకోవాలన్నారు. రాజకీయ పార్టీల నాయకులు అధికారులతో కలిసి పరిశీలనలో పాల్గొనప్పుడు ఏవైనా సూచనలు ఉంటే తెలియజేయాలని కోరారు. ఏఓ సుభద్ర, ఆత్మకూరు తహసీల్దారు ఎం లక్ష్మీనరసింహం, ఎంపీడీఓ ఐజాక్‌ప్రవీణ్, వైఎస్సార్‌సీపీ నాయకుడు నోటి వినయ్‌కుమార్‌రెడ్డి, బీఎస్పీ నాయకుడు నందా ఓబులేసు, టీడీపీ నాయకులు చంద్రారెడ్డి, బుజ్జిరెడ్డి, యువజన కాంగ్రెస్ నాయకుడు పన్నం నాగరాజు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న సువర్ణమ్మ

లోపాలుంటే చర్యలు తప్పవు

ఉదయగిరి: ఓటర్ల సర్వేలో లోపాలుంటే చర్యలు తప్పవని నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి సువర్ణమ్మ హెచ్చరించారు. ఆమె మంగళవారం తహసీల్దార్ కార్యాలయంలో ఏఈ ఆర్వోలు, సూపర్‌వైజర్లు, రాజకీయ పార్టీల నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఓటర్ల చేర్పులు, మార్పులు, తొలగింపులపై నోటీసులు జారీ చేసి పక్కాగా పరిశీలన చేపట్టాలన్నారు. ఒకే కుటుంబంలోని ఓట్లన్నీ ఒకే బూత్‌లో ఉండేలా చూడాలన్నారు. కొత్త పోలింగ్ బూత్‌ల ఏర్పాటుకు ఇప్పటి నుంచే ఏఈ ఆర్వోలు క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి ప్రతిపాదించాలన్నారు. ఓటర్ల పరిశీలన ప్రక్రియలో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో పలువురు సిబ్బందిపై వేటు పడిందన్నారు. నివేదికలు సక్రమంగా ఇవ్వలేదని సిబ్బందిపై అసహనం వ్యక్తం చేశారు. సిబ్బంది ఎన్నికల కమిషన్ అధీనంలో బీఎల్వోలు, సూపర్‌వైజర్లు ఉన్నారని, బాధ్యతగా విధులు నిర్వహించాలన్నారు. తహసీల్దార్ జగదీష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 26న అన్నదాన భవనం ప్రారంభం


మాట్లాడుతున్న పరమేశ్వరరెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా ఆస్పత్రిలో నిర్వహిస్తున్న నిత్యాన్నదానికి సంబంధించిన రూ.60 లక్షలతో వసతి భవనాన్ని నిర్మించినట్లు దాత, సాంబశివా చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకుడు కంచి పరమేశ్వరరెడ్డి తెలిపారు. ఆ భవనాన్ని ఈ నెల 26న ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి ప్రారంభించనున్నారని తెలిపారు. మంగళవారం పరమేశ్వరరెడ్డి విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఆస్పత్రిలోని రోగులకు నిత్యం అన్నదానం పెట్టేందుకు సంకల్పించినట్లు తెలిపారు. తన సొంత నిధులు వెచ్చించి 600 మందికిపైగా భోజనం తినేందుకు, తయారు చేసేందుకు వసతులతో భవనాన్ని నిర్మించినట్లు తెలిపారు. ఆయన వెంట విశ్రాంత హెచ్‌ఎం కేవీ శేషారెడ్డి, ఎ ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.